సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



హృద్రోగుల ఆయుష్షు పెంపు

జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యమిస్తోంది. గుండెనొప్పితో బాధపడే వారికి ఖరీదైన వ్యాక్సిన్లను ఉచితంగా వేసి ఆయుష్షును పెంచుతోంది. -IIలో



గవరమ్మపేట పరిసరాల్లో గజరాజులు -IIలో

జియ్యమ్మవలస మండలం గవరమ్మపేట పరిసర ప్రాంతాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. రైతులు భయపడుతున్నారు.



జిల్లా కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణానికి నేడు శంకుస్థాపన

జిల్లా కోర్టు నూతన భవన సముదాయం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ జరగనుంది. -IIలో

న్యూస్‌రీల్

వేగవంతంగా ఇళ్ల స్థల రిజిస్ట్రేషన్లు



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా పేదలకు ప్రభుత్వం అందజేసిన ఇళ్ల స్థల రిజిస్ట్రేషన్లను వేగవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదేశించారు. కలెక్టర్లతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్, గృహనిర్మాణం, రీసర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్, పాధ్యాన్యతా భవనాల నిర్మాణం తదితర పథకాలపై సమీక్షించారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధిహామీ పనులను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామన్నారు. లక్ష్యానికి మించి పనులు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ టికెట్ జనసేనకేనా..?

- టీడీపీ తరఫున టిక్కెట్ ఆశిస్తున్న జయకృష్ణ, భూదేవికి టీడీపీ తొలిజాబితాలో దక్కని చోటు

వీరఘట్టం: టీడీపీ–జనసేన తరఫున పోటీచేసే అభ్యర్థుల తొలి జాబితాలో పాలకొండ అభ్యర్థి పేరు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. పార్వతీపురం మన్యం జిల్లాలో సాలూరు, కురుపాం, పార్వతీపురం నియోజకవర్గాల్లో టీడీపీ తరఫున పోటీచేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. పాలకొండ నియోజకవర్గం టికెట్ ప్రకటించకపోవడంతో జనసేనకు కేటాయిస్తారనే ప్రచారం జోరందుకుంది. టీడీపీలో గ్రూపుల గోల టీడీపీ అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఇటీవల పాలకొండలో నారా లోకేశ్ నిర్వహించిన శంఖారావం సభలో తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు, గెలుపుసంగతిని పక్కనపెట్టి జనసేనకే టికెట్ కేటాయిస్తారన్న ఊహాగానాలు ఊపందుకున్నాయి.

'లిప్'తో సత్ఫలితాలు

- ప్రోగ్రాం రాష్ట్ర నోడల్ అధికారి కల్పన



ఇంగ్లిష్ టీచర్ తయారు చేసిన టీఎల్ఎంలను ప్రదర్శిస్తున్న లిప్ రాష్ట్ర నోడల్ అధికారి కల్పన

వీరఘట్టం: యూపీ, ఉన్నత పాఠశాల విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంచేందుకు సర్కారు బడుల్లో నిర్వహిస్తున్న లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమం సత్ఫలితాలిస్తోందని ప్రోగ్రాం రాష్ట్ర నోడల్ అధికారి సైల కల్పన అన్నారు. వీరఘట్టం బాలుర ఉన్నత పాఠశాలలో లిప్ ప్రోగ్రాం నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులు చక్కగా చదవడం, చదివిన అంశాలపై అవగాహన కలిగి ఉండడమే అభ్యసనాభివృద్ధి కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. లిప్ ప్రోగ్రాం నిర్వహణకు పాఠశాలలో పనిచేస్తున్న ఇంగ్లిష్ టీచర్ నీరజ తయారుచేసిన టీఎల్ఎంలు ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబర, ఉపాధ్యాయులు గర్భాన శ్రీనివాసరావు, సుధీర్, కల్లూరి శివ, శిర్లాపు ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో టికెట్ల లొల్లి!

- పార్టీకోసం పనిచేసే వారికి దక్కని టికెట్లు
- టికెట్ల కేటాయింపుపై టీడీపీ నాయకుల్లో అయోమయం
- నెల్లిమర్ల టికెట్‌ను ఎగరేసుకుపోయిన లోకం మాధవి
- ఎమ్మెల్యేనవుతానన్న కర్రోతు బంగార్రాజుకు మొండిచేయి
- మాధవికి వ్యతిరేకంగా టీడీపీ నేతల అత్యవసర సమావేశం
- మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడికి గజపతినగరం టికెట్ హుష్‌కాకి
- నిరసనగా పార్టీ పదవులకు నాయుడు, అనుచరుల రాజీనామా
- కిమిడి కళావెంకటరావు కుటుంబానికి చంద్రబాబు ఝలక్
- కళా వర్గం వ్యతిరేకించిన కోండ్రుకే రాజాం టికెట్ ఖరారు



సాక్షి ప్రతినిధి, విజయనగరం: టీడీపీలో టిక్కెట్ కోసం సిగపట్లు తారస్థాయికి చేరాయి. అనూహ్యంగా టికెట్ దక్కించుకున్నవారు ఆనందంలో ఉంటే... ఇన్నాళ్లూ పార్టీ కార్యక్రమాలకు, కటౌట్లకు భారీగా చేతిచమురు వదిలించుకున్నవారు మాత్రం నైరాశ్యంలో కూరుకుపోయారు. తమకు న్యాయం చేయకపోతే తడాఖా చూపిస్తామని ప్రత్యక్షంగా, పరోక్షంగా హెచ్చరికలు చేస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాల్లో పెద్ద దిక్కుగా ఉన్న సీనియర్ నాయకుడు కిమిడి కళావెంకటరావు కుటుంబానికి చంద్రబాబు ఝలక్ ఇచ్చారు. చివరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా ఇన్నాళ్లూ పనిచేసిన కిమిడి నాగార్జున పేరు తొలి జాబితాలో వెల్లడిగాకపోవడం గమనార్హం. పారాచ్యూట్ నాయకుడు గంటా శ్రీనివాసరావును చీపురుపల్లికి వెళ్లమని అధిష్టానం ఒత్తిడి చేస్తోందని తెలుసుకున్న నాగార్జున అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

కె.ఎ.నాయుడికి ఎదురుదెబ్బ...

గజపతినగరం నియోజకవర్గం టీడీపీ టిక్కెట్‌ను కొండపల్లి శ్రీనివాస్‌కు ఇవ్వడాన్ని మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు (కె.ఎ. నాయుడు), ఆయన వర్గం జీర్ణించుకోలేకపోతోంది. విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో వారంతా శనివారం మధ్యాహ్నం సమావేశమయ్యారు. ఇప్పటివరకూ నియోజకవర్గ ఇన్‌చార్జిగా పార్టీ కోసం కష్టపడ్డానని, మూడు పార్టీలు మారివచ్చిన కొండపల్లి కొండలరావుకు, ఆయన కుమారుడు శ్రీనివాస్‌కు అధిష్టానం పెద్దపీట వేయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తనతో పాటు 500 మంది తన అనుచరగణం పార్టీ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఆదివారం గజపతినగరంలో నిరసనకు పిలుపునిచ్చారు. గజపతినగరం టికెట్‌ను ఆశించిన మరో టీడీపీ నాయకుడు కరణం శివరామకృష్ణ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ చేసిన ద్రోహానికి కంటతడి పెట్టారు.

ఏకులా వచ్చి మేకు అయ్యింది...

నెల్లిమర్ల ఎమ్మెల్యే నేనే అవుతానంటూ ఇన్నాళ్లూ ఉబలాటపడిన కర్రోతు బంగార్రాజు నెత్తిన పిడుగుపడింది. జనసేన కోటాలో టికెట్ దక్కించుకున్న లోకం మాధవిని తొలుత తక్కువగా అంచనా వేశారు. ఆమె పవన్ కల్యాణ్ మద్దతుతో బరిలోకి దిగేసరికి బంగార్రాజు సహా నెల్లిమర్ల టీడీపీ నాయకుల గొంతులో పచ్చివెలక్కాయ పడింది. శనివారం సాయంత్రం విజయనగరంలోని ఒక హోటల్‌లో అత్యవసరంగా సమావేశమయ్యారు. బంగార్రాజు, డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, నెల్లిమర్ల మండల టీడీపీ అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పతివాడ తమ్మునాయుడు తదితరులంతా హాజరయ్యారు. మూడ్రోజుల్లో లోకం మాధవిని మార్చకపోతే మూకుమ్మడిగా పార్టీకి రాజీనామా చేయాలని, తాడేపల్లి వెళ్లి పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు ప్యాలెస్ వద్ద నిరసన తెలిపివద్దామని నిర్ణయించారు. లోకం మాధవి వర్గం మాత్రం సంతోషంలో ఉంది. అయితే, మాధవి ఎలా గెలుస్తుందో చూస్తామని టీడీపీ వర్గాలు బహిరంగంగానే సవాల్ చేస్తుండడం గమనార్హం.

'కళ' తప్పింది

ఎచ్చెర్ల అసెంబ్లీ నియోజకవర్గం విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ టీడీపీ సీనియర్ నాయకుడు కిమిడి కళావెంకటరావు విజయనగరం జిల్లా రాజకీయాలపై గతంలో పెద్దగా దృష్టి పెట్టలేదు. జిల్లాల పునర్విభజన తర్వాత తన సొంత ప్రాంతమైన రాజాం విజయనగరం జిల్లాలో విలీనమైన దృష్ట్యా ఇక చక్రం తిప్పాలని విశ్వప్రయత్నాలు చేశారు. తీరా టికెట్ల కేటాయింపు దగ్గరకు వచ్చేసరికి చెల్లని కాసు అయిపోయారు. ఎచ్చెర్ల టికెట్‌ను మరోసారి ఆశిస్తున్న ఆయన పేరు తొలి జాబితాలో ప్రకటించకపోవడం గమనార్హం. ఆయన సోదరుడి కుమారుడు, టీడీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడైన కిమిడి నాగార్జున కూడా మరోసారి చీపురుపల్లి టికెట్‌పై ఆశలు పెట్టుకున్నారు. తొలి జాబితాలో ఆయన పేరు కూడా వెల్లడించలేదు. కిమిడి కళావెంకటరావు కుటుంబం తీవ్రంగా వ్యతిరేకించినా రాజాం టికెట్‌ను కోండ్రు మురళీమోహన్‌కు చంద్రబాబు ఇవ్వడం చర్చనీయాంశమైంది. కోండ్రుకు బదులుగా స్వర్ణరాణికి టికెట్ ఇవ్వాలంటూ కిమిడి కుటుంబం, మాజీ ఎంపీపీ కొల్లా అప్పలనాయుడు చేసిన ప్రతిపాదన కూడా గాలికి కొట్టుకుపోయింది. మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి, మహానాడులో తొడకొట్టి సవాలు చేసిన ఆమె కుమార్తె గ్రీష్మ పేర్లను చంద్రబాబు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో వీరి తీరు ఎలా ఉంటుందన్నది ప్రశ్నార్థకం.

నివురుగప్పిన నిప్పులా అసమ్మతి...

బొబ్బిలి టికెట్ దక్కించుకున్న ఆర్‌వీఎస్‌కేకే రంగారావు (బేబీనాయన) మినహా తొలి జాబితాలో పేరు వెల్లడైన అందరికీ తమ నియోజకవర్గాల్లో అసమ్మతి నివురుగప్పిన నిప్పులా ఉంది. సీనియర్ నాయకుడు పూసపాటి అశోక్ గజపతిరాజు అస్త్ర సన్యాసం చేసి తన కుమార్తె అదితికి విజయనగరం టికెట్ ఇప్పించుకోగలిగారు. ఈ నియోజకవర్గంలో అశోక్ అణచివేసిన బీసీ మహిళా నాయకురాలు, మాజీ ఎమ్మెల్యే మీసాల గీత మాత్రం కిమ్మనలేదు. ఆమె అనుచరులు మాత్రం రగిలిపోతున్నారు. పార్వతీపురం టికెట్‌ను ఎన్నారై బోనెల విజయచంద్రకే చంద్రబాబు కేటాయించారు. దశాబ్దాలుగా పార్టీకి అండగా ఉన్న మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులకు మొండిచేయి చూపించారు. విజయచంద్రను వ్యతిరేకించిన మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట కూడా చెల్లలేదు. సాలూరులో భంజ్‌దేవ్ వర్గం ఎంత వ్యతిరేకించినా టికెట్ మాజీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణికే దక్కింది. కురుపాంలో ఒక వర్గం పూర్తిగా వ్యతిరేకించినా తోయక జగదీశ్వరికే టీడీపీ అధిష్టానం టికెట్ కేటాయించింది. వ్యతిరేక వర్గాలు తమ ప్రతాపం చూపేందుకు సిద్ధమవుతున్నాయి. అభ్యర్థులను డిపాజిట్లుకూడా రాకుండా ఓడిస్తే తప్ప చంద్రబాబుకు బుద్ధిరాందంటూ బహిరంగంగానే విమర్శిస్తున్నాయి. కొందరు పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నారు.



పార్టీ పదవికి రాజీనామా చేస్తూ పత్రాలను చూపిస్తున్న గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు

బీసీలకు చంద్రబాబు మోసం...

కేవలం ఓట్ల కోసమే బీసీల జపం చేసే చంద్రబాబు అసలు నైజం బయటపడింది. బీసీల జిల్లాగా పేరొందిన విజయనగరం జిల్లాకు సంబంధించి టీడీపీ–జనసేన కూటమి తరఫున తొలిజాబితాలో టికెట్లు దక్కించుకున్నవారిలో బీసీ అభ్యర్థి ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గమైన రాజాం మినహాయిస్తే మిగిలిన నాలుగు జనరల్ సీట్లలో బీసీలకు ఒక్క సీటు మాత్రమే దక్కింది. విజయనగరం, బొబ్బిలి టికెట్లను రాజులకే (క్షత్రియ సామాజిక వర్గానికి) కేటాయించింది.

వైభవంగా వేంకటేశ్వరుని చక్రతీర్థస్నానం



ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి దంపతులకు స్వామివారి ఆశీస్సులు అందజేస్తున్న అర్చకులు



స్వామివారికి చక్రతీర్థస్నానం చేస్తున్న అర్చకులు

- పాల్గొన్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు దంపతులు

గరుగుబిల్లి: తోటపల్లిలోని వేంకటేశ్వరస్వామి కళ్యాణమహోత్సవంలో భాగంగా శ్రీ పద్మావతి, భూదేవి సహిత స్వామివారికి శనివారం శ్రీచక్రతీర్థస్నాన ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం, విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, కలశారాధన, చూర్ణక్రతం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వేంకటేశ్వరస్వామిని నాగావళి నదీ తీరం వరకు తిరువీధిగా ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లారు. అక్కడ చూర్ణంతో అమ్మవారికి, స్వామివారికి సంప్రోక్షణ పూజలు జరిపారు. పవిత్ర నాగావళినదిలో స్వామివారికి భక్తులు పంచామృతాభిషేకం అనంతరం పుణ్యస్నానాలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు వి.వి.అప్పలాచార్యులు మాట్లాడుతూ లోక శాంతికోసం నదుల పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకాలు చేసామన్నారు. స్వామివారికి కళ్యాణం, అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులు నదుల్లో స్నానమాచరిస్తే సమస్త రోగాలు పోతాయని, వెయ్యి నదుల్లో స్నానం చేసిన పుణ్యం సిద్ధిస్తుందన్నారు. చక్రతీర్థ స్నానం కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు పాల్గొన్నారు. ఆలయ సిబ్బంది శేషవస్త్రాలను, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం పార్వతీపురానికి చెందిన ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, జ్యోతి దంపతులు భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఎం.సత్యనారాయణ, ట్రస్టు బోర్డు సభ్యులు, పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో నిఘాబృందాల పాత్ర కీలకం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్

పార్వతీపురం: ఎన్నికల నిర్వహణలో నిఘా బృందాల పాత్ర కీలకమని ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో విజిలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు సిబ్బందికి వారి విధులు, బాధ్యతలపై శనివారం శిక్షణ ఇచ్చారు. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థ మనదని, దాని ఎన్నికల నిర్వహణలో జాగురుకతతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల సమయంలో నిబంధనల ప్రకారం పనిచేయాలని కోరారు. ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు.

ధాన్యం సేకరణ విజయవంతం



సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నాగేశ్వరరావు

పార్వతీపురం: జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణ విజయవంతంగా పూర్తిచేసినట్టు జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు తెలిపారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా వాకాడ మాట్లాడుతూ ఈ ఏడాది ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం సేకరణ పూర్తయిందన్నారు. టార్పాలిన్లు, బిందు సేద్యం పరికరాల మంజూరుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇన్‌చార్జి జేసీ విష్ణుచరణ్ మాట్లాడుతూ మండల, జిల్లా స్థాయిలో చర్చించిన అంశాల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్ వ్యవసాయ శాఖ నివేదికను సమర్పిస్తూ వ్యవసాయంలో ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. నానో ఎరువును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. బస్తా యూరియా, డీఏపీలకు సమానమైన 500 ఎంఎల్ నానో యూరియాను రూ.130లకు, నానో డీఏపీ రూ.500లకు ఆర్‌బీకేల ద్వారా అందిస్తున్నట్టు వెల్లడించారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రబీలో 70,588 ఎకరాల సాగువిస్తీర్ణం కాగా, ఇంతవరకు 31,605 ఎకరాల్లో పంటలు సాగైనట్టు తెలిపారు. వేసవి కాలం పంటగా నువ్వు సాగుచేసే రైతుల కోసం 20 క్వింటాళ్ల విత్తనాలను సిద్ధం చేశామని, 50 శాతం రాయితీపై అందజేస్తున్నట్టు వెల్లడించారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్‌పథకం కింద గత నాలుగేళ్లలో రూ.1,39,505 మంది రైతుల ఖాతాలకు 13 విడతలుగా రూ.689.5 కోట్లు జమచేసినట్టు స్పష్టంచేశారు. జిల్లాలో 306 ఆర్‌బీకేల పరిధిలో 302 భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించగా, ఇప్పటికే 99 భవన నిర్మాణాలు పూర్తిచేసి వ్యవసాయశాఖకు అప్పగించామన్నారు. మరో 173 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. సమావేశంలో సివిల్ సప్లై మేనేజర్ దేవుళ్ల నాయక్, మత్స్యశాఖాధికారి తిరుపతయ్య, ఉద్యానశాఖాధికారి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

న్యాయ సేవలకు మరింత ఆసరా



బొబ్బిలి కోర్టు సముదాయం నిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న సుప్రీం, హైకోర్ట్ న్యాయమూర్తులు

బొబ్బిలి: న్యాయ సేవలకు మరింత ఆసరాగా కొత్త భవన సముదాయాలు నిర్మిస్తుండడం ఆనందంగా ఉందని సుప్రీం కోర్టు న్యాయమూర్తి పమిడి ఘంటం నర్సింహ అన్నారు. బొబ్బిలిలో రూ.31.20 కోట్ల వ్యయంతో తలపెట్టిన కోర్టు భవనాల సముదాయానికి శనివారం మధ్యాహ్నం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానికంగా ఉన్న ప్రైవేటు రెసిడెన్సీలో న్యాయవాదులతో ఏర్పాటుచేసిన సమావేశంలో నర్సింహ మాట్లాడారు. న్యాయవాదులు స్వతంత్రత కలిగి ఉండాలన్నారు. అధికారానికి అనుకూలంగా ప్రతికూలంగా ఉండడం వల్ల న్యాయవాదులు బలహీనమవుతున్నారని అభిప్రాయపడ్డారు. రాజ్యాంగ మౌలిక స్వరూపంలో జిల్లా కోర్టులు ఓ భాగమన్నారు. జిల్లా కోర్టులను బలోపేతం చేద్దామన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి యు.దుర్గాప్రసాద్, జిల్లా పోర్టుపోలియో జడ్జి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల శంకుస్థాపనకు ఆహ్వానం



కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న సీసీఐ రవికిరణ్, తదితరులు

పార్వతీపురం: స్థానిక రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 26న వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ నిషాంత్‌కుమార్‌ను ఆహ్వానిస్తూ ఆహ్వానపత్రికను శనివారం కలెక్టర్ చాంబర్‌లో సీసీఐ ఎం.రవికిరణ్ అందజేశారు. అమృత్ భారత్ స్టేషన్ స్కీంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆధునీకరించిన 554 స్టేషన్లు, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాసేజ్‌లను ప్రధానమంత్రి ప్రారంభించనున్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని 22 స్టేషన్ల ఆధునికీకరణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. వీటిలో వాల్తేరు డివిజన్ పరిధిలోని పార్వతీపురం, సింహాచలం, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపడ, పర్లాకిమిడి, బొబ్బిలి, రాయగడ, కోరాపుట్, అరకు, జైపూర్ రైల్వే స్టేషన్లు ఉన్నాయి. వీటిని రూ.500 కోట్లుతో ఆధునీకరించనున్నారు. రూ.170 కోట్లు అంచనా వ్యయంతో నాలుగు రోడ్డు ఓవర్ బ్రిడ్జి పనుల కోసం కూడా శంకుస్థాపన చేయనున్నట్టు సీసీఐ తెలిపారు. కార్యక్రమంలో రైల్వే సిబ్బంది ఎ.సతీష్, పి.త్రివిక్రమ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

గవరమ్మపేట పరిసరాల్లో గజరాజులు



పంట పొలాల్లో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట, ఆసంగి, వెంకటరాజపురం, రామినాయుడువలస పరిసర ప్రాంతాల్లో ఏనుగులు శనివారం సంచరించాయి. అరటి, జొన్న, వరి పంటలు ఉండడంతో దెబ్బతింటున్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖాధికారులు ఈ ప్రాంతం నుంచి ఏనుగులను తరలించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

తగ్గిన పాసింజర్ రైళ్ల టికెట్ చార్జీలు



చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ విన్నేష్

పార్వతీపురం టౌన్: పాసింజర్, డీఎంయూ, ఎంఈఎంయూ రైళ్ల టికెట్ చార్జీలు తగ్గించినట్లు పార్వతీపురం రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ విన్నేష్ తెలిపారు. రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం వేకువజాము నుంచి సాధారణ టికెట్ చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కరోనా విపత్కర సమయం నుంచి పాసింజర్ రైళ్లకు ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూళ్లు చేసేవాళ్లమని తెలిపారు. పాత విధానంలోనే పాసింజర్ రైళ్లకు సాధారణ టికెట్ చార్జీలు వసూలు చేస్తున్నామని తెలిపారు. ప్రయాణికులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆటో, క్యాబ్‌లపై ఈ చలానాలు రద్దు చేయాలి



కరపత్ర ప్రచారంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

విజయనగరం పూల్‌బాగ్: స్టాఫ్ లైన్ వైలేషన్ పేరుతో ఆటో, క్యాబ్‌లపై విధించిన ఈ చలానాలు రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద ధర్నా తలపెట్టినట్లు ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్‌మోహన్‌రావు తెలిపారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద శనివారం కరపత్ర ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జె.రామారావు, జి.భాస్కరరావు, బి.ప్రసన్న, వై.ఈశ్వరరావు, పి.ఆనంద్, వై.మోహన్, పి.శేఖర్, బి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు మరిన్ని సేవలందించాలి : ఎంపీ



ఈశ్వర్ బ్రెయిన్, స్పైయిన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ బెల్లాన

విజయనగరం ఫోర్ట్: పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని సేవలు అందించాలని విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక జిడ్డువారి వీధిలో నూతనంగా నిర్మించిన డాక్టర్ ఈశ్వర్ బ్రెయిన్, స్పైయిన్ సెంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యూరాలజీ వంటి స్పెషాలటీ సేవలు విజయనగరంలో అందుబాటులోకి రావడం రోగులకు శుభపరిణామమని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ముర్రు జయచంద్రనాయుడు, ఆస్పత్రి ఎండి తెంటు ఈశ్వరరావు, డాక్టర్ ఆర్ఎస్‌వీ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత్‌రెడ్డి

రాజాం సిటీ: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.అచ్యుతరెడ్డి అన్నారు. క్రీడలు మానసికోల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని తెలిపారు. జీసీఎస్ఆర్ కళాశాలలో శనివారం నిర్వహించిన క్రీడా దినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ప్రాధాన్యతను తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలు క్రీడల్లో విజేతలకు బహుమతులు అందించారు. అంబేడ్కర్ యూనివర్సిటీ పీడీ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ ఎం.పురుషోత్తమ్, పీడీ సీహెచ్ కేశవనారాయణ, సీహెచ్ రవీంద్ర పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹145	₹260	₹ 270

హృద్రోగుల ఆయుష్షు పెంపు

- ఆస్పత్రుల్లో జగనన్న హృదయ స్పందన కార్యక్రమం
- గుండె నొప్పి వచ్చే వారికి ప్రత్యేక చికిత్స
- నొప్పి తీవ్రతను తగ్గించే టీపీఏ ఇంజక్షన్లు ఇస్తున్న వైనం
- గత ఏడాది సెప్టెంబర్ నుంచి జిల్లాలో కార్యక్రమం అమలు
- సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రుల్లో సేవలు
- గుండె రోగులకు రూ.25 వేలు విలువ చేసే ఇంజక్షన్‌ను ఉచితంగా సరఫరా చేస్తున్న ప్రభుత్వం
- సకాలంలో చికిత్స అందడంతో నిలుస్తున్న ప్రాణాలు



గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో రోగికి ఈసీజీ తీస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: మానవుని జీవన శైలిలో మార్పులు రావడం వల్ల వయసుతో సంబంధం లేకుండా అనేక మంది గుండె జబ్బుల బారిన పడుతున్నారు. ఒకేచోట కూర్చొని గంటల తరబడి పని చేయడం, వ్యాయామం చేయకపోవడం, జంక్ ఫుడ్స్, ఫాస్ట్ ఫుడ్స్ వంటివి ఎక్కువగా తినడం వల్ల గుండె జబ్బులకు గురవుతున్నారు. గతంలో 50, 60 ఏళ్లు పైబడిన వారు గుండె జబ్బులు బారిన పడేవారు. ఇప్పుడు 25 ఏళ్లు, 30 ఏళ్లకే గుండె జబ్బులు బారిన పడుతున్నారు. ముఖ్యంగా గుండె నొప్పి (హార్ట్ ఎటాక్)కు ఎక్కువ మంది గురవుతున్నారు. గుండె నొప్పి వచ్చే సమయంలో సకాలంలో (గోల్డెన్ అవర్)లో చికిత్స అందించగలిగితే ప్రాణపాయం తప్పుతుంది. ఈ నేపథ్యంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గుండె నొప్పి, గుండె జబ్బులు బారిన పడిన వారికి సకాలంలో చికిత్స అందించి ప్రాణాలు కాపాడాలనే ఉద్దేశంతో జగనన్న హృదయ స్పందన అనే కార్యక్రమాన్ని చేపట్టింది. దీని వల్ల ఎంతోమంది ప్రాణాలు కాపాడుతుంది.

వైద్యులు, సిబ్బందికి శిక్షణ

గుండె సమస్య ఉన్న వారికి ఇచ్చే టీపీఏ ఇంజక్షన్ ఏ విధంగా వేయాలన్న దానిపై వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వ వైద్య కళాశాలలో ఇచ్చారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో జగనన్న స్పందన హృదయ స్పందన కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఇప్పటి వరకు 14 మందికి టీపీఏ ఇంజక్షన్లు ఇచ్చారు. బొబ్బిలి సీహెచ్‌సీలో ముగ్గురికి, సాలురు ఆస్పత్రిలో ముగ్గురికి, చీపురుపల్లి ఆస్పత్రిలో ముగ్గురికి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో ఇద్దరికి, ఎస్.కోట ఆస్పత్రిలో ఒకరికి, గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో ఒకరికి, బాడంగి ఆస్పత్రిలో ఒకరికి టీపీఏ ఇంజక్షన్ ఇచ్చారు. సకాలంలో చికిత్స అందడం వల్ల చాలా మంది పునర్జన్మ పొందగలుగుతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బి.పార్వతమ్మ. ఈమెది బాడంగి మండలం గూడెపువలస గ్రామం. కొద్ది రోజుల కిందట గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు బొబ్బిలి సామాజిక ఆస్పత్రిలో చేర్పించారు. వెంటనే ఆమెకు ఈసీజీ తీసి గుండె నొప్పిగా గుర్తించి మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో టీపీఏ (టెన్సిటిప్లెజ్)ఇంజక్షన్ చేశారు. దీంతో ఆమె కోలుకుంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు బడిగంటి సూరమ్మ. ఈమెది గజపతినగరం మండలం పురిటిపెంట. కొద్ది రోజుల క్రితం గుండె నొప్పి రావడంతో ఈమెను గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఈసీజీ తీసిన తర్వాత గుండె నొప్పిగా నిర్ధారించి టీపీఏ ఇంజక్షన్ చేశారు. గుండె నొప్పి తీవ్రత తగ్గడంతో మరుసటి రోజు విజయనగరంలో ఉన్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆమెకు స్టంట్ వేశారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటుంది.

ప్రతి ఆస్పత్రిలో అందుబాటులో వైల్స్

ప్రతి ఆస్పత్రిలోను టీపీఏ వైల్స్ రెండు, మూడింటిని అందుబాటులో ప్రభుత్వం ఉంచింది. ఇప్పటి వరకు 14 మందికి చికిత్స అందించగా ఇంకా 25 వైల్స్ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో ఇంజక్షన్ ఖరీదు రూ.25 వేలు కావడంతో దుర్వినియోగం కాకుండా వైద్యాధికారులు సక్రమంగా వినియోగమయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

సత్వర వైద్యంతో ఆయుష్షు పెంపు

టీపీఏ ఇంజక్షన్ ఇచ్చేందుకు ప్రతి ఆస్పత్రిలో సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. అదేవిధంగా ఈసీజీ, బెడ్, కంప్యూటర్, సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. గుండె సంబంధిత సమస్యలతో వచ్చే వారికి సత్వర వైద్యం అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చుననే భావనతో ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. గతంలో గుండె నొప్పి వచ్చే వారికి సకాలంలో వైద్యం అందకపోతే మృత్యువాత పడేవారు.

'జగనన్న హృదయ స్పందన'లో అందించే సేవలు

జగనన్న హృదయ స్పందన కార్యక్రమాన్ని జిల్లా ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రి, సీహెచ్‌సీల్లో అమలు చేస్తున్నారు. ప్రతి ఆస్పత్రిలోను ప్రత్యేకమైన బెడ్ ఏర్పాటు చేశారు. ఛాతి నొప్పితోగాని అలసటతోగాని, బాగా నీరసంతో గాని వచ్చే వారికి ఈసీజీ తీస్తారు. ఆ ఈసీజీని కార్డియాలజిస్టు ఉన్న ఆస్పత్రికి యాప్ ద్వారా రిపోర్టు పంపిస్తారు. కార్డియాలజిస్టు సదరు రోగికి గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లయితే కార్డియాలజిస్టు సలహా మేరకు రూ.25 వేలు విలువ చేసే టీపీఏ ఇంజక్షన్ ఇస్తారు. ఈ ఇంజక్షన్ ఇవ్వడం వల్ల వ్యాధి తీవ్రత తగ్గుతుంది. కోలుకున్న తర్వాత ఇంకా అవసరం అనుకుంటే కార్డియాలజిస్టు ఉన్న ఆస్పత్రికి రిఫర్ చేస్తారు. అక్కడ స్టంట్ వేయలా, సర్జరీ చేయాలన్నది నిర్ణయిస్తారు.

సేవలు భేష్



జిల్లా ఆస్పత్రి, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో ప్రభుత్వం జగనన్న హృదయ స్పందన కార్యక్రమాన్ని చేపట్టింది. ఇది చాలా గొప్ప కార్యక్రమం. వేలల్లో ఖరీదైన ఇంజక్షన్లను ప్రభుత్వం గుండె సమస్యలు ఉన్న వారి కోసం ఉచితంగా అందించి ప్రాణాలు కాపాడుతోంది.

– డాక్టర్ బి.గౌరీశంకర్, డీసీహెచ్ఎస్

నేడు వైఎస్సార్‌సీపీ సీనియర్స్ సిటిజన్స్ ఆత్మీయ సమావేశం

- హాజరుకానున్న రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, డిప్యూటీ స్పీకర్



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ వీఎస్ ప్రసాద్ తదితరులు

విజయనగరం: వైఎస్సార్‌సీపీ విజయనగరం నియోజకవర్గం ఆధ్వర్యంలో నగరంలోని భాష్యం స్కూల్ పక్కన ఉన్న మైదానంలో ఆదివారం నిర్వహించనున్న సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సాయంత్రం మైదానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, పిన్నింటి సూర్యనారాయణ, లక్ష్మణమూర్తి మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు బాసటగా నిలుస్తున్నారన్నారు. స్థానికంగా ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి నగర అభివృద్ధే ధ్యేయంగా ఐదేళ్ల పాటు నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారని అన్నారు. రానున్న ఎన్నికలలో సీనియర్ సిటిజన్స్ ఆశీర్వాదాన్ని కోరుతూ భారీ ఎత్తున ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం నిర్వహించే సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి, పార్లమెంటు సభ్యులు బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితర ప్రముఖులు హాజరుకానున్నారని తెలిపారు. ఈ మేరకు మైదానంలో సకల ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మారం బాల బ్రహ్మారెడ్డి, పిన్నింటి చంద్రమౌళి, జి.తిరుపతిరావు, శశిభూషణరావు, చిన్నారావు, రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో సత్తా చాటిన బాలికలు



రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్న జిల్లా జట్టు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన సబ్ జూనియర్స్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలికల జట్టు సత్తా చాటింది. ఈ నెల 22, 23 తేదీల్లో గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగిన అంతర్ జిల్లాల పోటీల్లో ఫైనల్స్‌కు అర్హత సాధించి 32–34 పాయింట్ల తేడాతో ఓటమి చెంది ద్వితీయ స్థానంలో నిలిచింది. టోర్నీలో బెస్ట్ ఆల్‌రౌండర్‌గా ప్రతిభ కనబరిచిన మజ్జి పావని వైఎస్సార్‌సీపీ నాయకులు అంబటి రాంబాబు చేతుల మీదుగా రూ.3వేల నగదు ప్రోత్సాహక బహుమతిని అందుకుంది. రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం దక్కించుకున్న బాలికల జట్టును జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రంగారావు దొర, కెవి.ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు అభినందించారు.

జిల్లా కోర్టు కాంప్లెక్స్ భవన నిర్మాణానికి నేడు శంకుస్థాపన

- భూమి పూజ చేయనున్న సుప్రీంకోర్టు జస్టిస్ నరసింహ, హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్



భూమి పూజకు సిద్ధమైన స్థలం

సాక్షి ప్రతినిధి విజయనగరం: జిల్లా కోర్టు నూతన భవన సముదాయం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ జరగనుంది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ చేతుల మీదుగా కోర్టు భవనాల నిర్మాణానికి భూమి పూజ జరగనుంది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. వీటీ అగ్రహారం వద్ద జిల్లా కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన భవన నిర్మాణానికి సంకల్పించారు. ఈ నేపథ్యంలో పాత భవనాలను తొలగించారు. రూ.99.20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ కాంప్లెక్సులో 19 కోర్టులతో పాటు కాన్ఫరెన్స్ హాల్స్, న్యాయవాదుల సంఘ భవనంతో పాటు వీఆర్ సిస్టంను ఏర్పాటు చేయనున్నారు. 6.58 ఎకరాల స్థలంలో నిర్మితం కానున్న ఈ కాంప్లెక్సును ఆధునిక వసతులతో రూపుదిద్దుకోనుంది. ఏసీ కోర్టు హాల్స్‌తో పాటు కక్షిదారులకు లిఫ్ట్ సౌకర్యం ఏర్పాటు కానుంది. శనివారం ఉదయం జిల్లా పోర్టు పోలియో జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లుతో పాటు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణ్ చక్రవర్తి శంకుస్థాపన ఏర్పాట్లను పరిశీలించారు. భూమి పూజ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యూవీ దుర్గాప్రసాద్, న్యాయవాద సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొంటారు.

పోగొట్టుకున్న మొబైల్స్ బాధితులకు అందజేత



పోగొట్టుకున్న మొబైల్‌ను బాధితులకు అందజేస్తున్న సీఐ విజయకుమార్

విజయనగరం క్రైమ్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 15 మొబైల్స్‌ను వారం రోజుల్లోనే ట్రేస్ చేసి, ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో సోషల్ మీడియా సైబర్ సెల్ సీఐ టీవీ.విజయకుమార్ సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్ వద్ద బాధితులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ సెల్ పోలీసులకు మొబైల్ ఫోన్‌లను పోయినట్లుగా ఇచ్చిన ఫిర్యాదులు ఆధారంగా మొబైల్స్‌ను ట్రేస్ చేసేందుకు సైబర్ సెల్ పోలీసులు, సిబ్బంది నిరంతరం చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాలలో పోగొట్టుకున్న మొబైల్స్ ఫోన్‌లను గురించి ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోనే 15 మొబైల్ ఫోన్‌లను ట్రేస్ చేశామన్నారు. వాటిని బాధితులకు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు ప్రశాంత్ కుమార్, నజీమా బేగం, సైబర్ సెల్ కానిస్టేబుళ్లు వాసుదేవ్, శ్రీనివాసరావు, రాజేష్, నాగమణి, శిరీషా ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ 1న పాలకొండలో జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: పాలకొండ సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఏప్రిల్ 1న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిగ్రీ, డిప్లమా, బీఎస్సీ, ఎంబీఏ అర్హత గల 18 నుంచి 30 ఏళ్ల యువత అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాలో టెక్‌తిమ్మన, డెక్కన్ ఫైన్ కెమికల్స్, అరబిందో, ఫిన్‌కేర్ స్మాల్ ఫైనాన్స్, హెటిరో డ్రగ్స్, మేధాసర్వో డ్రైవ్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, పేటీఎం, నవతా, బిఫిల్ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు తమ వివరాలను స్కిల్ యూనివర్స్.ఏపీఎస్ఎస్‌డీసీ.ఇన్ వెబ్‌సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని రిఫరెన్స్ నంబరుతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత సంబంధించిన పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

26న రోడ్ ఓవర్ బ్రిడ్జెస్, ఆర్ఓబీలకు శంకుస్థాపన

విజయనగరం టౌన్: అమృత్‌భారత్‌లో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లోని రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, రోడ్ ఓవర్ బ్రిడ్జెస్, ఆర్‌యూబీల నిర్మాణ పనులకు ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 26న ఉదయం 10.45 గంటలకు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారని రైల్వే అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పరిధిలోని పార్వతీపురం (రూ.14.76 కోట్లు), బొబ్బిలి (రూ.16కోట్లు), కొత్తవలస (రూ.18.77 కోట్లు), చీపురుపల్లి (రూ. 21 కోట్లు), శ్రీకాకుళం రోడ్ స్టేషన్‌లో రూ.23 కోట్లతో చేపట్టనున్న ఆధునికీకరణ పనులను ప్రధాని ప్రారంభిస్తారన్నారు. విజయనగరంలోని వీటీ అగ్రహారం సమీపంలోని మ్యాంగో యార్డ్ ప్రాంతం, చీపురుపల్లి, దూసి వద్ద ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తారన్నారు.

జంట హత్యల కేసులో నిందితుడి అరెస్టు



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రభాకరరావు, వెనుక ముసుగులో నిందితుడు లక్ష్మణరావు

బొండపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం సంచలనం సృష్టించిన జంట హత్యల కేసులో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు గజపతినగరం సీఐ ఎస్.వి.ప్రభాకరరావు తెలిపారు. స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. నిందితుడు డోల లక్ష్మణరావుకు తండ్రి రాము, సవతి తల్లి జయలక్ష్మికి మధ్య గత ఎనిమిదేళ్లుగా కుటుంబ తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో నిందితుడు లక్ష్మణరావు శుక్రవారం ఉదయం దుస్తులు ఉతుకుతుండగా మురుగునీరు తమ ఇంటి వైపు ఎందుకు వచ్చిందని సవతి తల్లి జయలక్ష్మి లక్ష్మణరావును నిలదీసింది. దీంతో ఇద్దరి మధ్య తలెత్తిన వాగ్వాదం పెద్దదైంది. ఈ క్రమంలో ఆవేశానికి లోనైన లక్ష్మణరావు కత్తితో ఉదయం 11 గంటల సమయంలో సవతి తల్లితో పాటు తండ్రి రాముపై దాడి చేశాడు. విచక్షణారహితంగా నరికేయడంతో వారు అక్కడికక్కడే మృతి చెందినట్లుప్రాథమిక విచారణలో నిర్ధారించాం. కాలనీలో హత్యలు జరిగినట్టుగా వీఆర్ఓ బి.రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకొని అక్కడే ఉన్న నిందితుడు లక్ష్మణరావును అదుపు లోకి తీసుకొని స్టేషన్‌కు తరలించాం. అనంతరం కోర్టులో హాజరుపరిచాం. జడ్జి సూచన మేరకు రిమాండ్‌కు తరలించామని సీఐ చెప్పారు.